# నేయి పోసి నీళ్ళొదిలిన లలన!

అలా బృహస్పతి అమరావతికి పోగానే ఇలా ఇంట్లో రకరకాల వంటకాల తయారు చేయించి అంతలో వచ్చిన చంద్రుడిన్ని బంగరు పీట మీద కూర్చోబెట్టి తలంటుతూ మీ గురువుగారు నిజంగా వెళ్ళారా? దూరం సాగారా! లేక మధ్యలోనే తిరిగొస్తాడా? మనకు దైవవశాత్తు ఏకాంతం దొరికింది? ఇక నీ ష్టం అని తలంటుపూర్తి చేసి స్నానం చేయించి ఇంపైన భోజనం చేయించి తానూ గొజ్జంగి నీటి స్నానమాడి వలపచెంగాని పావడ కట్టుకుని, ఆపై బంగారంచు బవంతి చీరసింగారించి పైఠాణి రవిక తొడిగి ముఖాన జవ్వాజి బొట్టుపెట్టి కస్తురి అద్దుకుని చంద్రుడు విడిసిన తోటలోకి వచ్చింది.

ఆమెను చూసిన చంద్రుడికి కొమ్మకాదిది బంగారు బొమ్మగాని, ఇంతి కాదిది జాజి పూబంతిగాని, కలికికాదిది మరుని పూములికి కాని, భామ కాదిది లావణ్య సీమ కానిఅన్పించింది.

ఆమీదట ఆమె అంగాంగాన్నితడవి తీరాచూస్తూ తన శాస్త్ర పాండిత్యం అంతా వెల్లడి అయ్యేలా వర్ణిస్తాడు. ఆకృతిని హేమ రూపియా - ముక్కు తీరు చూడ తిలోత్తమ - మోముచూసిన శశిరేఖ - మాటతీరు మంజుఘోష అని అప్సర శిరోమణులతో పోలుస్తాడు.

అలా ఆమె సౌందర్యానికి లోనయి—

చూడకుండంగ కూడదీ సుదతి సొబగు, చూసినంతనె మదిలోన చొచ్చె బాళియేమిటికి వచ్చెనిచటికి ఇందు వదన ఎట్టులున్నదో ఇంక రతీశ్వరాజ్ఞ ఈశ్వరాజ్ఞ కాదిది రతి ఈశ్వరుడైన మన్మధుడి ఆజ్ఞ ఎట్లుండో అనుకుంటారు.

మన్మధుడి ఆజ్ఞ ఏమంటుంది? ఏముంటుంది? ఏకాంతంతో ఏ స్త్రీ పురుషులు కుర్చున్నా తనువు పులకింప చేయడం, చిత్తం తత్తరింపచేయడం, వివశతను పొందించడం ఆమీదట విరహం లేదా సంయోగం ఇదేకాదా మన్మధాజ్ఞ.

భయం భయంగా తారను చూస్తూ ఎందుకొచ్చావు. ఇంట్లో పనుల్లేవా? మనల్ని లా చూస్తే ఏమనుకుంటారు అని మందలించినట్లుగా అంటే ఆమె పని పడే వచ్చాను. ఇంట్లో పనేముంది? ఎవరైనా చూస్తారనా? చూడనీ. ఏమైనా అనుకుంటారా? అనుకోనీ? ఎవరేం గొప్ప? మన్మథ బారికి లోను కాని వాళ్ళెవరు? ఐనా నిజం చెబుతా విను.

నీనెర నీటు, నీ సొగసు, నీరసికత్వం, నీ విలాసం, నీ నవ మోహనాకారం, నీయెల ప్రాయం చూచి చూచి ప్రేమించి అభిమానంతో దాచి ఇన్నాళ్ళూ మన్మథ వేదకు గురయ్యాను. నీ కోసమే నీ పొందు కోసమే వచ్చాను. నన్ను కరుణించి కటాక్షించి కౌగిలించి సుఖాల లాలించు అంది.

ఆ మాట వినగానే చంద్రుడి గుండె ఝల్లుమంది. అదంతా తగని ఉడంతం అని నీతులు చెప్పాడు.

దానితో నేయి పోసిన అగ్గిలాగా భగ్గు మంది. వెతలు తీరని వెతతో ఏమేమో అంది. ఆ మిదట అతని అందాన్ని పొగిడింది. ఆగలేక పైబడి కౌగిలించింది.

చంద్రుడు తార అందానికి బందీ అయ్యాడు. శృంగార బందీ అయ్యాడు. శృంగార సంబంధి అయ్యాడు. అలా వాళ్లిద్దరూ శృంగారకాండ సర్వస్వం పరస్పరం పాఠం చెప్పుకుంటూ వుండగా వచ్చాడు బృహస్పతి.

వచ్చిన తర్వాత కుశల ప్రశ్నలు అయ్యాక వాళ్ళ అన్యోన్యత చూసిన ఆయనకు అనుమానం వచ్చింది. ఇది పరిచయంతో ఏర్పడిన చనువో లేకపోతే మరో బంధ సంబంధమో చూద్దాం అనుకున్నాడు.

పరిహాసాలు, కను సన్నలు, బొమముడిపాట్లు, సర సోక్తులు, మర్మ గర్భ సంభాషణలు చూశాడు. కోపంతో తారను పిలిచాడు.

నువ్వు సాధ్వివి అనుకున్నాను. ఇలా చేశావేం. ఆ మూర్ఖుడ్ని శిష్యుడనుకున్నాను. వాడలా ప్రవర్తించాడేం? మీవల్ల అపకీర్తి వచ్చిందే! పెద్దలెవరూ లేకుండా మీ ఇద్దర్నీ ఒంటరిగా విడిచి వెళ్ళానే అదీ నా తప్పు. పెద్దతనం వచ్చి బుద్ధి పెడతల పట్టింది! ఎంత పాపం చేశారు మీరు!

నన్ను నాన్నా అనీ, నిన్ను అమ్మగారు అని పిలిచే వాడే. అన్ని వేదాలు చదివాడే ! అలా చేశాడేం ! నిజం ! ఆడు వారిని నమ్మకూడదు. మీకు నిలకడ వుండదు. వావి వరసలు వుండవు. స్నేహం లేదు. భయం లేదు. చంచల హృదయులు. దురాత్మకులు. అబద్ధాల కోరులు అందుకే రాజులు అంతః పురాల్లో పోతుటీగనైన రానివ్వరు...

ఏందుకా ఏడ్పు? ఏమిటలా బొటన వ్రేలు నేలరాస్తావు. మీ శీలమంతా దివ్య దృష్టితో చూశానలే! ఇంతకీ రెచ్చ గొట్టింది నువ్వా? వాడా? చెప్పు.... తప్పు చేసిన వారిని శిక్షిస్తాను....

భర్త మాటలు వింటూ - తప్పు చేసిన వారిని దండిస్తా మన్నారు.... నిజానికి తప్పు చెయ్యందెవరు ? ఆ బ్రహ్మగారి కూతురు అహల్యే తప్పు చేసిం దంటే నేర్చి నడువ ఒకరి తరమౌతుందా? ఎలాగైనా మగవాళ్ళు ఓర్చుకోవాలి. లేకపోతే మీకే నగుబాటు కదా! అని భర్త పాదాల మీద వాలి ఎక్కిళ్ళు పెడ్తూ ఏడ్చింది...తార....

ఇంకేం అంటారు బృహస్పతి....చంద్రుడ్ని పిలిచి... ఊరికి వెళ్ళిరా అని పంపేశాడు. చంద్రుడు కూడా భయ భక్తులతో సెలవు తీసుకుని వెళతాడు.

వియోగంలో ఇద్దరూ మునిగిపోతారు. కొన్నాళ్ళకు తాళలేక వచ్చి గురుపత్నిని లేవదీసుకుని వెళతాడు చంద్రుడు. బృహస్పతి ఇంద్రుడికి కధంతా చెప్పి తన భార్యను తిరిగి తెప్పించ మంటాడు. ఇంద్రుడు యుద్ధం ప్రకటిస్తాడు చిత్రంగా బృహస్పతి శత్రువైన శుక్రుడు చంద్రుడికి తోడొస్తాడు. పెద్ద పోరు జోరుగా జరుగుతుంది. చివరికి రాజీగా—

శివకేశవుల యుద్ధాన్ని బ్రహ్మ ఆపు చేస్తాడు. బుధుడు తార కుమారుడు చంద్రుని తనయుడే అని నిర్ధారించి అబ్బాయిని చంద్రుడికి తారను బృహస్పతికి ఇప్పిస్తాడు బ్రహ్మ—

శేషం వేంకటపతి చమత్కారాలు అడుగడుగునా ఆస్వాదించ దగ్గవి.... ప్రతి పదంలోనూ చమత్కారం రంగరించడం చేమకూర వెంకన్న నేర్పించిందే ఐనా దాన్ని బాగా వంట పట్టించుకుని ప్రదర్శించిన వాడు వేంకటపతి మాత్రమే !

—o—